జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥ సంపుటి:1 ॥ సంచిక: 110 ॥ సోమవారం ॥ 14-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

14 సెప్టెంబర్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:15 తిథి తదియ ఉ. 7:07 వరకు తరువాత చవితి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం చిత్తా మ. 1:53 వరకు తరువాత స్వాతి యోగం బ్రహ్మ మ. 12:40 వరకు కరణం గరజి ఉ. 7:07 వరకు వనిజ రా. 7:25 వరకు వర్జ్యం రా. 7:51 నుండి రా. 9:33 వరకు దుర్ముహూర్తం మ. 12:36 నుండి మ. 1:24 వరకు మ. 3:01 నుండి మ. 3:50 వరకు రాహుకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:09 వరకు యమగండం ఉ. 10:40 నుండి మ. 12:11 వరకు గుళికాకాలం మ. 1:42 నుండి మ. 3:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 7:17 నుండి ఉ. 8:57 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:35 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు వినాయక చవితి శుభాకాంక్షలు. 14-9-2026 (సోమవారం) మా కార్యాలయానికి సెలవు. కావున 15-9-2026 (మంగళవారం) పత్రిక వెలువడదు. మళ్లీ 16-9-2026 పత్రిక వస్తుంది. గమనించగలరు. -ఎడిటర్



# ఆర్యవైశ్యుల అభ్యున్నతికి రేవంత్ భరోసా

**రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన**

**ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వ సహకారం**

**ఐక్యతతోనే రాజకీయాల్లో ప్రాధాన్యం సాధ్యమని సూచన**

పేద ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. సమాజంలో సౌమ్యులు, మానవతావా దులుగా పేరుగాంచిన ఆర్యవైశ్యులు పేదల విశ్వాసాన్ని నిలబెట్టే బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో వారి పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 13: హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో నిర్మించనున్న ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయానికి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యుడు వేమనరేందర్ రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్‌తో పాటు పలువురు శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి, ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ భవనం కేవలం ఒక భవనంగా కాకుండా పేద ఆర్యవైశ్య కుటుంబాల తరువాయి 2 వ పేజీలో..

## బ్రిక్స్ నిర్ణయాలు అమల్లోకి రావాలి

**బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు**

**నిర్ణయాలు కేవలం పత్రాలకే పరిమితం కాకూడదు**

**సాంకేతికత, కీలక ఖనిజాలపై సహకారం పెంచాలని పిలుపు**

**స్టార్టప్‌లు, డిజిటల్ వ్యవసాయానికి ప్రతిపాదనలు**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, : బ్రిక్స్ 18వ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు తీసుకునే నిర్ణయాలు కేవలం ప్రకటనలు, పత్రాలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే ఫలితాలుగా మారాలని స్పష్టం చేశారు. దిల్లీ డిక్లరేషన్ బ్రిక్స్ దేశాల ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశను చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీలోని భారత్ (మిగతా 2వ పేజీలో



## వినాయక చవితి శుభాకాంక్షలు

**ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించిన సీఎం రేవంత్**

**గణేష్ మండపాల వద్ద భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు**

**వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కొనసాగుతుందని వెల్లడి**

వినాయక చవితి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో ఉన్న ఆటంకాలు తొలగిపోయి ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని గణపతిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ప్రజలను ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాల్లో భక్తులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించాలని సూచించారు. గణపతి నవరాత్రులను ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.



## బిజినెస్ ఎక్స్‌పోలో అనిత సందర్శన

**మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అవసరం: హోంమంత్రి**

**పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వం సహకారం**

**విశాఖ బిజినెస్ ఎక్స్‌పో--2026లో పాల్గొన్న హోంమంత్రి అనిత**

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న బిజినెస్ ఎక్స్‌పో--2026ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వ్యాపార, పారిశ్రామిక సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తూ వాటి కార్యకలాపాలు, ఉత్పత్తులు, వ్యాపార అవకాశాల గురించి వివరాలు తెలుసుకున్నారు.

విశాఖపట్నం, సెప్టెంబర్ 13: ఎక్స్‌పోలో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో హోంమంత్రి ముచ్చటించారు. పరిశ్రమల అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, మార్కెట్ అవకాశాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో వ్యాపార రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను - 2 వ పేజీలో..



## పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

**పొన్నం ప్రభాకర్ సమక్షంలో విశిష్ట వ్యక్తులకు సత్కారం**

కరీంనగర్, సెప్టెంబర్ 13, : శ్రీ పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీ పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా "పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం--2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజంలోని వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులను ఈ సందర్భంగా సత్కరించారు. వ్యవసాయ రంగంలో ఎం. కోదండరెడ్డి, సాహిత్య రంగంలో వెలిచాల కొండల్‌రావు, కళారంగంలో గొట్టే కనకవ్వలకు "పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం--2026" ప్రదానం చేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, (మిగతా 2వ పేజీలో



## బీసీ కులగణనకు కోడ్ విధానం కావాలి

**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్**

**కులగణన విషయంలో బీజేపీ, కాంగ్రెస్ తమ బాధ్యత నిర్వర్తించాలని వ్యాఖ్య**

2

## నేటి రాశి ఫలాలు

**మేషం:** బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు తప్పవు. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు మరింత చికాకు పరుస్తాయి. ఋణదాతల నుండి ఒత్తిడి అధికమై నూతన ఋణాలు చేస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

**వృషభం:** నూతన వాహనం కొనుగోలు చేస్తారు. నూతన వ్యక్తులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగస్తులకు రావలసిన పదోన్నతుల పొందుతారు. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి.

**మిధునం:** ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులలో అవరోధాలు కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. దూరపు బంధువుల సలహాలు కలసివస్తాయి. వ్యాపారాలు అనుకూలిస్తాయి.

**కర్కాటకం:** స్థిరాస్తి ఒప్పందాలలో ఆటంకాలు తప్పవు. ముఖ్యమైన పనుల్లో జాప్యం కలుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో అధికారుల నుండి సమస్యలు తప్పవు. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి. వృత్తి వ్యాపార విషయంలో జాగ్రత్త అవసరం.

**సింహం:** వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని మార్పులు ఉంటాయి. బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. సోదరులు కొన్ని విషయాలలో మీతో విబేదిస్తారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు నిరాశ పరుస్తాయి.

**కన్య:** స్థిరాస్తి కొనుగోలుకు అవరోధాలు తొలగుతాయి. నూతన కార్యక్రమాలు చేపడతారు. దూరపు బంధువుల కలయిక ఉత్సాహాన్నిస్తుంది. వృత్తి వ్యాపారములలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఆకస్మిక వస్తు వాహన లాభాలు పొందుతారు. బంధు వర్గం నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

**తుల:** కుటుంబ సభ్యులతో కొన్ని వివాదాలు తీరతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలుచేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. నూతన భూ, వాహనాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** మిత్రులతో స్వల్ప విభేదాలు ఉంటాయి. చేపట్టిన పనులు కొన్ని వాయిదా వేస్తారు. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు కొంత ఒత్తిడి కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు.

**ధనస్సు:** కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. గృహమున కొందరి ప్రవర్తన భాధను కలిగిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు తప్పవు. విద్యార్థులకు ఒత్తిడి పెరుగుతుంది. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. బంధువులతో స్వల్ప వివాదాలు ఉంటాయి.

**మకరం:** ఆత్మీయుల నుంచి వివాదాలకు సంబంధించి కీలక సమాచారం అందుతుంది. సన్నిహితుల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. అనుకున్న పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. చిన్ననాటి మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి కొనుగోలుకు అవరోధాలు తొలగుతాయి.

**కుంభం:** వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. చేపట్టిన వ్యవహారాలలో అవాంతరాలు ఉంటాయి. కొత్త ఋణాలు చేస్తారు. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆప్తులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. వ్యాపార వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు.

**మీనం:** ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. ముఖ్యమైన పనులు సజావుగా పూర్తి చేస్తారు. వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగాలలో రావలసిన ప్రమోషన్ లు పొందుతారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.





# ఆర్యవైశ్యుల అభ్యున్నతికి రేవంత్ భరోసా

మొదటి పేజీ తరువాయి

పిల్లలకు విద్య, శిక్షణ, అభివృద్ధి అవకాశాలు కల్పించే కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సంఘ ప్రతినిధులకు సూచించారు. సాధారణ ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన మహాత్మా గాంధీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహానేతగా ఎదగడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో గాంధీ విగ్రహాలు కనిపించడం ఆయన ప్రభావానికి నిదర్శనమన్నారు. అలాగే ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక మంత్రిగా విశిష్ట సేవలందించిన కొణిజేటి రోశయ్య సేవలను కూడా స్మరించారు.గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అవసరమైన సరుకులను అరువుగా ఇచ్చి ఆదుకునే విషయంలో ఆర్యవైశ్యులు మానవతా దృక్పథంతో వ్యవహరిస్తారని ముఖ్యమంత్రి తెలిపారు. నమ్మకాన్ని నిలబెట్టడంలో వారి పాత్ర విశేషమని పేర్కొన్నారు. ముందుచూపు, ఆర్థిక క్రమశిక్షణ, జాగ్రత్తగా వ్యవహరించే లక్షణాలు ఆర్యవైశ్యుల డీఎన్ఏలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా, సమైక్యంగా ముందుకు సాగితేనే మరింత బలం చేకూరుతుందని రేవంత్ రెడ్డి సూచించారు. రాజకీయ రంగంలోనూ తమ వాటాను తామే సాధించుకోవాలంటే ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం కల్పించిందని గుర్తుచేస్తూ, భవిష్యత్తులోనూ వారి అభ్యున్నతికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.







# బిజినెస్ ఎక్స్‌పోలో అనిత సందర్శన

మొదటి పేజీ తరువాయి

వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వంగలపూడి అనిత, వ్యాపార రంగానికి కొత్త అవకాశాలను అందించడంలో ఇలాంటి ఎక్స్‌పోలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలకు తమ ప్రతిభను చాటుకునేందుకు, వ్యాపార విస్తరణకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి ద్వారా యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలకమని హోంమంత్రి అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా గుర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. బిజినెస్ ఎక్స్‌పో--2026 ద్వారా వ్యాపారవేత్తలు, పారిశ్రామిక సంస్థలు, పెట్టుబడిదారులు ఒకే వేదికపైకి రావడం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని వంగలపూడి అనిత అభిప్రాయపడ్డారు. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పునరుద్ఘాటించారు.

## బీసీ కులగణనకు కోడ్ విధానం కావాలి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, :**

దేశవ్యాప్తంగా బీసీ కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి, ప్రతి కులానికి ప్రత్యేకమైన యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన చేపట్టాలని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జవహర్ భవన్‌లో నిర్వహించిన ఓబీసీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, బీసీలకు న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి అని పేర్కొన్నారు. కులాల గుర్తింపులో పొరపాట్లు జరగకుండా ముందుగానే స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే కులగణన అత్యంత కీలకమని గతంలో పేర్కొన్న బీజేపీ ప్రభుత్వం, కులగణన ప్రక్రియ ప్రారంభమైన తర్వాత అవసరమైన విధానాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బీసీ కులగణన చేస్తామని చెప్పి ఇప్పుడు సరైన వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం మాట తప్పడమేనని ఆరోపించారు. కులగణన అంశంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీ కులాలకు కూడా ప్రత్యేక కోడ్‌లు కేటాయించాలని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో పిలిచే పరిస్థితులు ఉన్నాయని, ధోబి--రజక, నాయీ బ్రాహ్మణ--మంగలి, గౌడ్--ఈడిగ, శ్రీశైన--నాడార్, ముదిరాజు, ఫిషర్‌మెన్ వంటి కులాలు ప్రాంతాలవారీగా భిన్న పేర్లతో నమోదవుతున్నాయని వివరించారు. కేవలం పేర్ల ఆధారంగా నమోదు చేస్తే స్పెల్లింగ్, ఉచ్చారణలో చిన్న తేడాల వల్లే కులాల వివరాలు తప్పుగా నమోదయ్యే ప్రమాదం ఉందన్నారు. 2011లో నిర్వహించిన కులగణనలో కులాల పేర్లను శాస్త్రీయంగా వర్గీకరించకపోవడంతో లక్షలాది కులాలు ఉన్నట్లు నమోదు చేసిన పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. బ్రిటిష్ పాలనలో 1931లో జరిగిన కులగణనలో సుమారు 4,300 కులాలు నమోదయ్యాయని, ప్రస్తుతం సరైన జాబితా లేకుండా సర్వే చేస్తే మరింత గందరగోళం ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల రాష్ట్రాల వారీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ జాబితాల తరహాలో దేశవ్యాప్తంగా ఓబీసీ కులాల సమగ్ర జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. "జిత్నీ ఆబాదీ ఉత్నా హిస్సా" అనే నినాదం నిజంగా అమలు కావాలంటే ముందుగా దేశంలో బీసీల జనాభా ఎంతుందో ఖచ్చితంగా లెక్కించాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.

## బ్రిక్స్ నిర్ణయాలు అమల్లోకి రావాలి

(మొదటి పేజీ తరువాయి

మండపంలో జరిగిన ముగింపు సమావేశంలో మాట్లాడిన ప్రధాని మోదీ, రెండు రోజుల పాటు జరిగిన చర్చలు బ్రిక్స్‌పై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేశాయని అన్నారు. బ్రిక్స్ కేవలం సభ్య దేశాల వేదిక మాత్రమే కాకుండా ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు అన్వేషించే సమర్థ వ్యవస్థగా రూపాంతరం చెందుతోందని పేర్కొన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ అవసరమని మోదీ తెలిపారు. ప్రపంచం ఇప్పుడు బ్రిక్స్ నుంచి కేవలం హామీలు, ప్రకటనలు మాత్రమే కాకుండా స్పష్టమైన ఫలితాలను ఆశిస్తోందన్నారు. మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న బ్రిక్స్ ఆ అంచనాలను అందుకోవాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. కీలక ఖనిజాలు, సరఫరా వ్యవస్థల విషయంలో సభ్య దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కావాలని మోదీ సూచించారు. బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా సరఫరా వ్యవస్థలను మరింత నమ్మకంగా, స్థిరంగా మార్చుకోవచ్చన్నారు.

## పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

(మొదటి పేజీ తరువాయి

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పురస్కారాలను అందజేశారు. పురస్కార గ్రహీతలకు మెమెంటోతో పాటు రూ.50 వేల నగదు బహుమతిని కూడా అందజేశారు. తమ తమ రంగాల్లో దీర్ఘకాలంగా అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు ప్రదానం చేయడం విశేషమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పొన్నం సత్తయ్య గౌడ్ సేవలను స్మరించుకున్నారు. సమాజ అభ్యున్నతి, సామాజిక చైతన్యం, ప్రజా సేవల పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ప్రొఫెసర్ హరగోపాల్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో అభిమానులు, సామాజిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. పురస్కారాల ద్వారా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను ప్రోత్సహించడం జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

శ్వేత

# సంపాదకీయం

**శనివారం 12-9-2026**

## బ్రిక్స్‌కు సరికొత్త దిశ..

ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనికపై శరవేగంగా మారుతున్న సమీకరణల నడుమ భారత్ మరో చారిత్రక ఘట్టానికి ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విశ్వశాంతికి, ప్రపంచ మానవాళి సంక్షేమానికి సరికొత్త దిశను నిర్దేశిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ... ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలకమైన సరఫరా వ్యవస్థల పరిరక్షణే లక్ష్యంగా ఈ రెండు రోజుల సదస్సు సాగుతుంది. సవాళ్లతో కూడుకున్న ప్రపంచ పరిస్థితులలో ఒక బలమైన అనుసంధానకర్తగా తన నాయకత్వాన్ని చాటుకునేందుకు భారత్ ముందుకు సాగుతుంది. మరోవైపు ఈ ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం చారిత్రాత్మకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. బ్రిక్స్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో.. ఈ వేదిక ఇప్పుడు కొత్త దశలోకి అడుగుపెడుతోందన్నారు. 20 ఏళ్ల వయసు మానవ జీవితంలో పరిపక్వత, బాధ్యతలు పెరిగే దశకు సంకేతమని.. అదే విధంగా బ్రిక్స్ కూడా తన పరిణతి దశకు చేరుకుందని ప్రధాని వ్యాఖ్యానించారు. గత రెండు దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. ఎవరికీ వ్యతిరేకంగా కాకుండా.. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్నదే బ్రిక్స్ విధానంగా ఉండాలని ఆయన అన్నారు. సభ్య దేశాల మధ్య ఐక్యత, ఏకాభిప్రాయాన్ని స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగంతో ప్రారంభమైంది. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. ప్రపంచ పాలనలో సంస్కరణలు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం, ఆర్థిక సంస్థల్లో మార్పులు వంటి అంశాలపై ప్రధాని మోదీ తన ప్రసంగంలో స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాబోయే 20 ఏళ్లకు బ్రిక్స్ ఒక కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత్ బ్రిక్స్ అధ్యక్షత ప్రజా కేంద్రిత, మానవతా ప్రథమ విధానం ఆధారంగా కొనసాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. సౌలభ్యం, ఆవిష్కరణ, సహకారం, స్థిరత్వం తమ ప్రాధాన్యతలని వెల్లడించారు. ప్రపంచ పాలనలో సంస్కరణలకు సంబంధించి సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ఈ రోడ్‌మ్యాప్‌కు ప్రాతినిధ్యం, స్పందన/జవాబుదారీతనం, నియమాల రూపకల్పన అనే మూడు అంశాలు ప్రాతిపదికగా ఉండాలని సూచించారు. ప్రపంచ వ్యవస్థలో అన్ని దేశాలకు సముచిత ప్రాతినిధ్యం ఉండాలని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలు మరింత సమగ్రంగా ఉండాలని ఆయన అన్నారు.ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలను ఇకపై వాయిదా వేయకూడదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ అంశంపై చర్చలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్దిష్ట కాలపరిమితి, స్పష్టమైన ఫలితాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పరిస్థితులు మారుతున్నప్పటికీ అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్య వ్యవస్థ మాత్రం మార్పులకు అనుగుణంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న దేశాలకు గ్లోబల్ ఎకనామిక్ గవర్నెన్స్‌లో తగిన పాత్ర లభించాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో ఓటింగ్ హక్కులు, నాయకత్వ పదవులు, విధాన ప్రాధాన్యతలు నేటి ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి కీలకంగా ఉన్న దేశాలు.. ప్రపంచ ఆర్థిక పాలనను రూపొందించే ప్రక్రియలో కూడా తగిన స్థానం పొందాలని స్పష్టం చేశారు.రాబోయే 20 ఏళ్లకు కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో బ్రిక్స్ ముందుకు సాగాలని ప్రధానమంత్రి మోదీ ప్రతిపాదించారు. ప్రతి ఏడాది బ్రిక్స్ అధ్యక్ష పదవి మారుతున్నప్పటికీ.. దీనివల్ల సంస్థాగత కార్యక్రమాల వేగం తగ్గకూడదన్నారు. ఇందుకోసం 'కొనసాగింపు మరియు అమలు యంత్రాంగం' ఏర్పాటు చేయాలని భారత్ ప్రతిపాదిస్తోందని తెలిపారు. దీని కింద బ్రిక్స్ కార్యక్రమాలు, నిర్ణయాలు, ఫలితాలను ట్రోయికా ద్వారా పర్యవేక్షించవచ్చని సూచించారు.

ప్రపంచ సంక్షోభాలను ఎదుర్కొనే విషయంలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందువరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియల్లో మాత్రం వెనుకబడి ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ.. 'విశేషాధికారాల పిరమిడ్'ను 'భాగస్వామ్య వేదిక'గా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రతి దేశం గొంతు వినిపించేలా, ప్రతి సభ్యుడికి భాగస్వామ్యం ఉండేలా ప్రపంచ వ్యవస్థ మారాలని అన్నారు. అంతర్జాతీయ నిర్ణయాల్లో మానవాళి అభివృద్ధినే కేంద్రంగా ఉంచాలని ప్రధాని స్పష్టం చేశారు.మొత్తంగా.. బ్రిక్స్ 20 ఏళ్ల ప్రయాణాన్ని కొత్త దశగా అభివర్ణించిన ప్రధాని మోదీ.. రాబోయే రెండు దశాబ్దాలకు సంస్థను మరింత ప్రభావవంతమైన, సమగ్ర, ఫలితాల ఆధారిత వేదికగా మార్చేందుకు భారత్ తరఫున పలు కీలక ప్రతిపాదనలు చేశారు. ముఖ్యంగా సంస్కరణలు, గ్లోబల్ ఆర్థిక సంస్థల్లో మార్పులు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం వంటి అంశాలపై మోదీ ప్రసంగం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఏదేమైనా ఈసారి భారత్ లో జరిగే ఈ సదస్సుపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నేడు రెండవ రోజు జరిగే పరిణామాలపైనే ఎక్కువగా దృష్టి సారించ వచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## బీసీ కులగణనకు కోడ్ విధానం కావాలి: మాజీ మంత్రి

### ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన చేపట్టాలన్న సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 : దేశవ్యాప్తంగా బీసీ కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి, ప్రతి కులానికి ప్రత్యేకమైన యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన చేపట్టాలని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జవహర్ భవన్‌లో నిర్వహించిన ఓబీసీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, బీసీలకు న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి అని పేర్కొన్నారు. కులాల గుర్తింపులో పొరపాట్లు జరగకుండా ముందుగానే స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే కులగణన అత్యంత కీలకమని గతంలో పేర్కొన్న బీజేపీ ప్రభుత్వం, కులగణన ప్రక్రియ ప్రారంభమైన తర్వాత అవసరమైన విధానాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బీసీ కులగణన చేస్తామని చెప్పి ఇప్పుడు సరైన వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం మాట తప్పడమేనని ఆరోపించారు. కులగణన అంశంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని కోరారు.ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీ కులాలకు కూడా ప్రత్యేక కోడ్‌లు కేటాయించాలని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో పిలిచే పరిస్థితులు ఉన్నాయని, ధోబి--రజక, నాయీ బ్రాహ్మణ--మంగలి, గౌడ్--ఈడిగ, శ్రీశైన--నాడార్, ముదిరాజు, ఫిషర్‌మెన్ వంటి కులాలు ప్రాంతాలవారీగా భిన్న పేర్లతో నమోదవుతున్నాయని వివరించారు. కేవలం పేర్ల ఆధారంగా నమోదు చేస్తే స్పెల్లింగ్, ఉచ్చారణలో చిన్న తేడాల వల్లే కులాల వివరాలు తప్పుగా నమోదయ్యే ప్రమాదం ఉందన్నారు.

2011లో నిర్వహించిన కులగణనలో కులాల పేర్లను శాస్త్రీయంగా వర్గీకరించకపోవడంతో లక్షలాది కులాలు ఉన్నట్లు నమోదు చేసిన పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. బ్రిటిష్ పాలనలో 1931లో జరిగిన కులగణనలో సుమారు 4,300 కులాలు నమోదయ్యాయని, ప్రస్తుతం సరైన జాబితా లేకుండా సర్వే చేస్తే మరింత గందరగోళం ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల రాష్ట్రాల వారీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ జాబితాల తరహాలో దేశవ్యాప్తంగా ఓబీసీ కులాల సమగ్ర జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.

"జిత్నీ ఆబాదీ ఉత్నా హిస్సా" అనే నినాదం నిజంగా అమలు కావాలంటే ముందుగా దేశంలో బీసీల జనాభా ఎంతుందో ఖచ్చితంగా లెక్కించాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లలో కూడా బీసీ మహిళలకు న్యాయం జరగాలంటే బీసీ జనాభా, ప్రాతినిధ్యంపై స్పష్టమైన గణాంకాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీలకు తగిన వాటా కల్పించాలంటే సమగ్ర కులగణన అనివార్యమని స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా బీసీ నాయకులు, మేధావులు, సామాజిక సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి కాస్ట్ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. లక్షలాది మందితో ఆందోళనలు నిర్వహించి, ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలిసి బీసీ కులగణనలో శాస్త్రీయ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా బీసీలు ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



## పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

**పొన్నం ప్రభాకర్ సమక్షంలో విశిష్ట వ్యక్తులకు సత్కారం**

**వ్యవసాయం, సాహిత్యం, కళల రంగాల్లో సేవలకు గుర్తింపు**

**పురస్కార గ్రహీతలకు నగదు బహుమతి, మెమెంటో అందజేత**

కరీంనగర్, సెప్టెంబర్ 13: శ్రీ పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీ పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా "పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం--2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజంలోని వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులను ఈ సందర్భంగా సత్కరించారు. వ్యవసాయ రంగంలో ఎం. కోదండరెడ్డి, సాహిత్య రంగంలో వెలిచాల కొండల్‌రావు, కళారంగంలో గొట్టే కనకవ్వలకు "పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం--2026" ప్రదానం చేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పురస్కారాలను అందజేశారు. పురస్కార గ్రహీతలకు మెమెంటోతో పాటు రూ.50 వేల నగదు బహుమతిని కూడా అందజేశారు. తమ తమ రంగాల్లో దీర్ఘకాలంగా అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు ప్రదానం చేయడం విశేషమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పొన్నం సత్తయ్య గౌడ్ సేవలను స్మరించుకున్నారు. సమాజ అభ్యున్నతి, సామాజిక చైతన్యం, ప్రజా సేవల పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ప్రొఫెసర్ హరగోపాల్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో అభిమానులు, సామాజిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. పురస్కారాల ద్వారా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను ప్రోత్సహించడం జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సమాజానికి సేవ చేసిన మహనీయుల వారసత్వాన్ని భావితరాలకు చేరవేయడం ఇలాంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అన్నారు.



## వినాయక చవితికి శుభాకాంక్షలు తెలిపిన సీఎం

హైదరాబాద్, సెప్టెంబర్ 13: వినాయక చవితి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో ఉన్న ఆటంకాలు తొలగిపోయి ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని గణపతిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ప్రజలను ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాల్లో భక్తులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించాలని సూచించారు. గణపతి నవరాత్రులను ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో పండుగ వేళ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే గణేష్ మండపాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలు ఎలాంటి అసౌకర్యం లేకుండా దర్శనాలు చేసుకునేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖతో పాటు సంబంధిత అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, అత్యవసర సేవల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

వినాయక నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

# మంచిర్యాల జిల్లా, కాసిపేట మండలం తహసీల్దార్ శ్రీ అలుగునూరి రోషయ్యకు ఏసీబీ కేసులో శిక్ష

**అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్**

కరీంనగర్‌లోని ఎస్పీఈ & ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయమూర్తి శ్రీ నామా సంతోష్ కుమార్, Cr. No. 02/ACB-KNR/2013 (C.C. No. 19/2016) కేసులో తీర్పును వెలువరించారు. ఈ తీర్పులో, మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం తహసీల్దార్ శ్రీ అలుగునూరి రోషయ్యను, 'అవినీతి నిరోధక చట్టం-1988'లోని సెక్షన్లు 7 మరియు 13(2) (సెక్షన్ 13(1)(d)తో కలిపి చదవాలి) కింద నేరస్తుడిగా నిర్ధారిస్తూ, ఐపీ.ఎ. సెక్షన్ 248(2) ప్రకారం శిక్ష విధించారు.



అవినీతి నిరోధక చట్టం-1988లోని సెక్షన్ 7 కింద నమోదైన నేరానికి గాను, నిందితుడైన తహసీల్దార్ శ్రీ అలుగునూరి రోషయ్యకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష మరియు రూ. 5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువడింది. జరిమానా చెల్లించని పక్షంలో, ఆయన మూడు నెలల సాధారణ కారాగార శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. అలాగే, అదే చట్టంలోని సెక్షన్ 13(1)(d) (సెక్షన్ 13(2)తో కలిపి చదవాలి) కింద నమోదైన నేరానికి గాను, ఆయనకు మరో రెండేళ్ల కఠిన కారాగార శిక్ష మరియు రూ. 5,000 జరిమానా విధించబడింది. ఈ జరిమానా చెల్లించని పక్షంలో, ఆయన మరో మూడు నెలల సాధారణ కారాగార శిక్షను అనుభవించాల్సి ఉ ంటుంది. దీనికి ముందు, 09.01.2013న, మంచేర్యాల జిల్లా కాసిపేట మండలం తహసీల్దార్‌గా పనిచేస్తున్న నిందిత అధికారి శ్రీ అలుగునూరి రోశయ్య, ఫిర్యాదుదారుకు అధికారికంగా అనుకూలం చేకూర్చేందుకు---అంటే రెవెన్యూ రికార్డులలో (జమాబందీ) వ్యవసాయ భూమిని ఫిర్యాదుదారు పేరు మీద మార్పిడం (మ్యుటేషన్) మరియు పట్టాదారు పాస్‌బుక్ జారీ చేయడం కోసం---రూ. 10,000/- లంచం డిమాండ్ చేసి స్వీకరించారు.

# నేవీ డిపో కావాలంటూ ఎంపీను కలిసిన రైతులు

## 90 శాతం రైతులు అనుకూలంగా ఉన్నారని ఎంపీ కి తెలిపిన రైతు నేతలు

## సీఎం చంద్రబాబుతో మాట్లాడి ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానన్న ఎంపీ

ఏలూరు, సెప్టెంబర్ 13: ఆదివారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను కొయ్యలగూడెం గ్రామ రైతులు, నేతలు కలిశారు. 90 శాతం రైతులు అనుకూలంగా ఉన్నప్పటికీ భూములు లేకపోయినా ఆందోళనలు చేస్తున్న కొద్ది మంది వలన తమ ప్రాంతం అభివృద్ధికి ఆటంకం ఏర్పడటం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నేవీ డిపో ఎట్టి పరిస్థితుల్లోనూ కొయ్యలగూడెంలోనే ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రైతులు ఎంపీకి విజ్ఞప్తి చేశారు.

రైతుల విజ్ఞప్తులపై స్పందించిన ఎంపీ.. గత ఎన్నికల్లో కొయ్యలగూడెం ప్రాంత ప్రజలు తనకు పూర్తి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నేవీ ఆయుధ డిపో వస్తే కొయ్యలగూడెం ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందనీ, వేలాదిమంది ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశంతో నేవీ డిపో ప్రాజెక్టు తీసుకువచ్చేందుకు తాను కృషి చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లతో మాట్లాడి నేవీ డిపో కల సాకారమయ్యేట్లు చూస్తానని ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రైతులకు స్పష్టం చేశారు. దీనితో పాటు గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు హోం మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఇవే కాకుండా గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలు, స్మశానవాటికలు వంటి అన్ని సౌకర్యాలపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఎంపీ స్పందన పట్ల రైతులు



సంతోషం వ్యక్తం చేస్తూ, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నాయకత్వంలో తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఎంపీ ను కలిసిన వారిలో కొయ్యలగూడెంకు చెందిన రైతులతో పాటు కూటమి పార్టీల నేతలు బొల్లిన నిర్మల కిశోర్, కారం భీమరాజు,చిటికన బాల గంగాధర్ తిలక్, కొల్లూరి రవి, బొమ్మ దుర్గ బాబు, గొల్లిశెట్టి శ్రీను, మద్దు మోహన్, జ్యేష్ట రామకృష్ణ, మల్లి శెట్టి రాంబాబు, చిరువూరి శ్రీను, గద్దె రాము, చెప్పుల అశోక్ కుమార్,చెరుకూరి గోపాలరావు, దుగ్గిరాల బోస్, గ్రామ రైతులు ఉన్నారు.



# విద్యుత్ కోతలు నిరసిస్తూ వైసీపీ కొవ్వొత్తుల ర్యాలీ

కామవరపుకోట, : రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ కంభం విజయరాజు ధ్వజమెత్తారు. ఆదివారం సాయంత్రం విద్యుత్ కోతలు నిరసిస్తూ కామవరపుకోట కొత్తూరు బస్టాండ్ సెంటర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి చెక్‌పోస్ట్ సెంటర్ వరకు పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో భారీ ఎత్తున కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల వైసీపీ అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెక్‌పోస్టు సెంటర్ వద్ద కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించిన అనంతరం విజయరాజు మాట్లాడారు.

నియోజకవర్గంతో పాటు కామవరపుకోట మండలంలో ఇష్టం వచ్చినట్టు విద్యుత్ కోతలతో వృద్ధులు, పిల్లలు ఇక్కట్లకు గురవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం గృహావసరాలకు విద్యుత్ ఆపేసి తమకు కావాల్సిన, అస్మదీయులైన వారి పరిశ్రమలకు మాత్రం నిరంతర విద్యుత్ సరఫరా చేస్తోందన్నారు. తక్షణమే ప్రభుత్వం గృహావసరాలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సాయిన కనకరాజు, గుర్రాల రవి, భీమిరెడ్డి వెంకన్నబాబు, మనెల్లి మద్ది రామయ్య, నార్ని శివన్నారాయణ, దేవరపల్లి రామ్మోహన్‌రావు, పెద్దిరాజు, నెక్కలపూడి బాబీ, తమ్మిశెట్టి గిరిజ సుబ్రహ్మణ్యం, సిరిశెట్టి సిద్దిరాజు, మెడంకి విజయరావు, కన్న, బొల్లు సత్యనారాయణ, నానాది సాగర్ కిరణ్, ఎంపీటీసీ అంజిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, రఘుపతి రెడ్డి, మెరుగు బాబురావు , జోడాలా వెంకట్, యానాద్రి పీటర్‌తో పాటు మండలంలో పలు గ్రామాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు



విజయనగరం, సెప్టెంబర్ 13: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. గణపయ్య ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు చేకూరాలని కోరారు. ప్రతిష్ట సమయాలలో, విద్యుత్ అలంకరణ సమయంలో నిమజ్జన సమయాలలో చెరువులు, కాలవలు, ప్రాజెక్టులు వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే నిమజ్జనం, ఊరేగింపు కార్యక్రమాలలో పోలీసు అధికారులు తెలియజేసిన భద్రతా నియమాలను పాటించాలన్నారు. భక్తి పూర్వకంగా జరుపుకునే కార్యక్రమంలో శుభప్రదంగా జరగాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పర్యావరణ హితమైన వస్తువులతో పండుగను నిర్వహించాలని సూచించారు. వినాయక చవితిని ఆధ్యాత్మిక భావనలతో జరుపుకోవాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు.

# వినాయక చవితి శుభాకాంక్షలు

## కలెక్టరు కె.వెట్రిసెల్విలి



ఏలూరు, సెప్టెంబరు 13: విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి, సౌభాగ్యాలతో జీవించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని, జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని గణనాథుని ప్రార్థిస్తున్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టరు కోరారు.



# కామవరపుకోటలో 42 అడుగుల భారీ వినాయకుని విగ్రహం

ఏలూరు జిల్లా, కామవరపుకోట మండలం, (కింగ్ న్యూస్ ప్రతినిధి) సెప్టెంబర్ 13: ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అత్యంత భారీ వినాయకుని విగ్రహం ఏలూరు జిల్లా కామవరపుకోటలో ఉంది. ఈ విగ్రహాన్ని స్థానిక శ్రీ లక్ష్మీ హయగ్రీవ పీఠం వ్యవస్థాపకులు, పంచ శతాధిక ఆలయ ప్రతిష్టాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉగాది పురస్కార అవార్డు గ్రహీత సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు (దుర్గ బాబు) ఆధ్వర్యంలో ధాతల సహాయ సహకారాలతో ఏర్పాటు చేశారు. సాధారణంగా అనేక చోట్ల ఎత్తైన ఆంజనేయ స్వామి విగ్రహాలు ఉండటం మనం చూస్తూ ఉంటాం. కానీ దానికి భిన్నంగా దుర్గబాబు ప్రత్యేకంగా కామవరపుకోటలో భారీ వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే తలంపుతో ఈ 42 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కామవరపుకోటలో అత్యంత పురాతనమైన ప్రాచీనమైన రాజుల కాలం నాటి వీరభద్ర స్వామి వారి ఆలయం ఖ్యాతి గడించింది. అలాగే ఊరికి ఈశాన్యం మూలన గుర్రాల చెరువు సమీపంలో ఈ భారీ విగ్రహం భక్తులను విశేషంగా అలరిస్తుంది. ద్వారకాతిరుమల, మద్ది ఆంజనేయ, గుంటుపల్లి బౌద్ధాలయాలకు వెళ్లే భక్తులు తప్పనిసరిగా ఈ ఎత్తయిన భారీ 42 అడుగుల వినాయకుడి విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే ఈ విగ్రహం వద్ద వినాయక చవితి వేడుకలను స్థానికంగా ఉన్న యువత ఎంతో వైభవంగా నిర్వహిస్తూ ఉంటారు. ఆదిమూల గణపతిగా, విఘ్నాలు తొలగించే విఘ్నాధిపతిగా తొలి పూజలు చేస్తూ ఉంటారు. అయితే ఈ విగ్రహం వద్ద వార్షికోత్సవంతో పాటు, గణపతి హోమం, సిద్ది బుద్ధి కళ్యాణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో మరి ఎక్కడా లేనటువంటి భారీ విగ్రహం కామవరపుకోటలో కొలువై ఉ ండటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఉంటారు.

# వినాయక చవితి: భక్తి సంస్కృతి ప్రకృతి పరిరక్షణకు ప్రతీక

**డెస్క్, సెప్టెంబర్ 13**

భారతీయ సంస్కృతిలో అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలలో వినాయక చవితి ఒకటి. భాద్రపద శుద్ధ చవితి రోజున జరుపుకునే ఈ పండుగను గణేశుడి జన్మదినంగా భావిస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 14న వినాయక చవితి వేడుకలు ప్రారంభమవుతున్నాయి. గణపతి బప్పాను విఘ్నేశ్వరుడు, వినాయకుడు, గజాననుడు, లంబోదరుడు వంటి అనేక పేర్లతో భక్తులు ఆరాధిస్తారు. ఏ శుభకార్యమైనా ప్రారంభించే ముందు గణపతిని పూజించడం భారతీయుల ఆచారంగా మారింది. ఎందుకంటే గణేశుడు విఘ్నాలను తొలగించి విజయాన్ని ప్రసాదించే దేవుడిగా విశ్వసిస్తారు. అందుకే వినాయక చవితి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, భక్తి, విశ్వాసం, కుటుంబ అనుబంధాలు, సామాజిక ఐక్యతను ప్రతిబింబించే ఒక గొప్ప సంస్కృతిక ఉత్సవం. పురాణాల ప్రకారం పార్వతీ దేవి తన శరీరానికి పూసుకున్న పసుపుతో ఒక బాలుడిని సృష్టించి ద్వారపాలకుడిగా నియమించింది. ఆ తరువాత జరిగిన సంఘటనల్లో శివుడు ఆ బాలుడి తలను ఖండించగా, పార్వతీ దేవి దుఃఖాన్ని చూసి ఏనుగు తలను అమర్చి తిరిగి ప్రాణం పోశాడు. అప్పటి నుంచి గజాననుడిగా గణపతి ప్రసిద్ధి చెందాడు. దేవతలందరూ ఆయనకు ప్రథమ పూజాధికారం కల్పించారని పురాణాలు చెబుతున్నాయి. అందుకే వివాహం నుంచి గృహప్రవేశం వరకు, విద్యాభ్యాసం నుంచి వ్యాపార ప్రారంభం వరకు ప్రతి శుభకార్యంలో ముందుగా గణపతిని పూజిస్తారు. గణేశుడి రూపంలో కూడా గొప్ప సందేశాలు దాగి ఉన్నాయి. పెద్ద తల విశాలమైన ఆలోచనలకు, పెద్ద చెవులు ఇతరుల మాటలను శ్రద్ధగా వినడానికి, చిన్న కళ్ళు ఏకాగ్రతకు, తొండం అనుకూలతకు ప్రతీకలుగా భావిస్తారు. వినాయక చవితి సందర్భంగా ఇళ్లలో, దేవాలయాల్లో, వీధుల్లో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పత్రి, దుర్వా గడ్డి, మోదకాలు, ఉండ్రాళ్లు, లడ్డూలతో స్వామికి నైవేద్యాలు సమర్పిస్తారు.






# హిందీ దివస్: భాషా వారసత్వానికి గౌరవ వందనం

**డెస్క్, సెప్టెంబర్ 13,**

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక భాషలు, మాండలికాలు మాట్లాడే దేశాలలో ఒకటి. ఇక్కడ ప్రతి రాష్ట్రానికి, ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన భాషా సంపద ఉంది. ఈ వైవిధ్యభరితమైన భాషా సంస్కృతుల మధ్య పరస్పర అనుసంధానానికి హిందీ ఒక ప్రధాన భాషగా ఎదిగింది. దేశంలోని ఉత్తర, మధ్య భారత రాష్ట్రాల్లో విస్తృతంగా ఉపయోగించబడే హిందీ నేడు భారతదేశంలో అత్యధిక మంది మాట్లాడే భాషగా గుర్తింపు పొందింది. ఈ భాష ప్రాముఖ్యతను గుర్తుచేసుకుంటూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న హిందీ దివస్‌ను నిర్వహిస్తారు. భాష అనేది కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాకుండా ఒక జాతి చరిత్రను, సంస్కృతిని, భావజాలాన్ని ప్రతిబింబించే అద్దం. అలాంటి భాషలకు గౌరవం ఇవ్వడం దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడమే అవుతుంది. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ పరిపాలనకు సంబంధించిన అనేక అంశాలపై రాజ్యాంగ సభలో విస్తృత చర్చలు జరిగాయి. అందులో అధికార భాష అంశం అత్యంత ప్రాధాన్యం పొందింది. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య పరిపాలనా సంబంధాలు సులభతరం కావాలంటే ఒక అధికార భాష అవసరమని భావించారు. ఈ నేపథ్యంలో 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగ సభ హిందీని దేవనాగరి లిపిలో కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా ఆమోదించింది. ఈ చారిత్రక నిర్ణయం భారత భాషా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. అదే రోజును గుర్తుగా చేసుకుని ప్రతి ఏడాది హిందీ దివస్‌ను నిర్వహిస్తున్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సమయంలో దేశ భాషా వైవిధ్యాన్ని కూడా సమానంగా గౌరవించాలనే దృక్పథాన్ని రాజ్యాంగ నిర్మాతలు ప్రదర్శించారు. హిందీ భాష అభివృద్ధి వెనుక అనేక శతాబ్దాల చరిత్ర ఉంది. సంస్కృత భాష నుంచి పుట్టుకొచ్చిన ప్రాకృత, అపభ్రంశ భాషల పరిణామ క్రమంలో హిందీ రూపుదిద్దుకుంది. భక్తి ఉద్యమ కాలంలో కబీర్, తులసీదాస్, సూరదాస్ వంటి మహాకవులు హిందీ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. అనంతరం భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కూడా హిందీ కీలక పాత్ర పోషించింది. మహాత్మా గాంధీతో సహా అనేక మంది జాతీయ నాయకులు దేశ ప్రజలను ఒకే తాటిపైకి తీసుకురావడంలో హిందీ ఒక సాధనంగా ఉపయోగపడుతుందని విశ్వసించారు. దీంతో హిందీ భాష దేశవ్యాప్తంగా మరింత విస్తరించింది. హిందీ దివస్ సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సాహిత్య సభలు, కవిసమ్మేళనాలు నిర్వహిస్తారు. విద్యార్థుల్లో భాష పట్ల ఆసక్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. ప్రభుత్వ విభాగాల్లో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. ఈ కార్యక్రమాల ఉద్దేశం హిందీని ఇతర భాషలపై రుద్దడం కాదు; అధికార భాషగా దాని పాత్రను గుర్తుచేసుకుంటూ భాషా అవగాహన పెంపొందించడం. భారత రాజ్యాంగం అన్ని భాషలకు సమాన గౌరవం కల్పించింది. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో ప్రస్తుతం 22 భాషలకు గుర్తింపు ఉంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ వంటి భాషలన్నీ భారత సాంస్కృతిక సంపదలో భాగమే. హిందీ దివస్ సందర్భంలో గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ఒక భాష ఎదగడం అంటే మరో భాష వెనుకబడిపోవడం కాదు. అన్ని భారతీయ భాషలు పరస్పరం పరిపూరకంగా అభివృద్ధి చెందితేనే దేశ భాషా సంపద మరింత బలోపేతం అవుతుంది. నేటి డిజిటల్ యుగంలో హిందీ భాష వినియోగం గణనీయంగా పెరిగింది. సోషల్ మీడియా, యూట్యూబ్, వెబ్‌సైట్లు, మొబైల్ అప్లికేషన్లు, డిజిటల్ వార్తా మాధ్యమాల ద్వారా హిందీ కంటెంట్ విస్తృతంగా అందుబాటులోకి వస్తోంది. కృత్రిమ మేధస్సు, యంత్ర అనువాదం, డిజిటల్ విద్యా వేదికల అభివృద్ధితో హిందీ వినియోగానికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా డిజిటల్ ప్రపంచంలో తమ భాషలోనే సమాచారాన్ని పొందగలుగుతున్నారు. ఈ పరిణామాలు భాషల అభివృద్ధికి సాంకేతికత ఎంతగానో దోహదపడుతుందని నిరూపిస్తున్నాయి.

# ఇండోనేషియాలో ఘోర నౌక ప్రమాదం



**జకార్తా, సెప్టెంబర్ 13,**

ఇండోనేషియాలో ఘోర సముద్ర ప్రమాదం చోటు చేసుకుంది. 213 మంది ప్రయాణికులు, 30 మంది సిబ్బందితో కలిపి మొత్తం 243 మందిని తీసుకెళ్తున్న 'వర్గో ట్రాన్స్‌పోర్ట్ 8' నౌక జావా సముద్రంలో మునిగిపోయింది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 107 మందిని సురక్షితంగా రక్షించగా, ఆరుగురు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. మరో 130 మంది గల్లంతుకావడంతో వారి కోసం సహాయక బృందాలు విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. అధికారుల వివరాల ప్రకారం తూర్పు జావాలోని సురబయ నుంచి బయలుదేరిన నౌక దక్షిణ కాలిమంటన్‌లోని బంజ ర్‌మాసిన్‌కు వెళ్తోంది. ఆదివారం తెల్లవారుజామున నౌక కెప్టెన్ నుంచి వచ్చిన చివరి సమాచారంలో సముద్రంలో భారీ అలలు ఎగిసిపడుతున్నాయని, నౌక ఒకవైపుకు ఒరిగిపోతోందని పేర్కొన్నట్లు తెలిపారు. ఆ సందేశం అనంతరం కొద్దిసేపటికే నౌకతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. బంజర్‌మాసిన్ రేవుకు సుమారు 148 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగినట్లు ఇండోనే షియా అధికారులు నిర్ధారించారు. ప్రమాద సమయంలో సముద్రంలో సుమారు మూడు మీటర్ల ఎత్తులో అలలు ఉండటంతో నౌక సమతుల్యత కోల్పోయి మునిగిపోయినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం అందు కున్న వెంటనే సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఇండోనేషియా నౌకాదళానికి చెందిన ఓ నౌకతో పాటు మరో నాలుగు నౌకలు, హెలికాప్టర్, టగ్ బోట్లను రంగంలోకి దించా రు. సముద్రంలో గల్లంతైన వారిని గుర్తించేందుకు విస్తృతంగా గాలిస్తున్నారు. రక్షించిన ప్రయాణికులను సమీపంలోని తూర్పు జావా పోర్టుకు తరలించి వైద్యస హాయం అందిస్తున్నారు. ఇదిలా ఉండగా, బంజర్‌మాసిన్‌లోని త్రిశక్తి పోర్టు వద్ద గల్లంతైన వారి కుటుంబ సభ్యులు, బంధువులు భారీగా చేరుకున్నారు. తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం ఆందోళనగా ఎదురుచూస్తున్నారు. అధికారు లు విడుదల చేస్తున్న జాబితాలను పరిశీలిస్తూ క్షేమ సమాచా రం కోసం నిరీక్షిస్తున్నారు. వేలాది ద్వీపాలతో కూడిన ఇండోనేషియాలో సముద్ర రవాణా ప్రధాన ఆధారంగా ఉంది. అయితే భద్రతా ప్రమాణాల లోపాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా తరచూ సముద్ర ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. అధికారిక రికార్డుల్లో నమోదైన ప్రయాణికుల సంఖ్యకు, వాస్తవంగా నౌకలో ఉన్న వారి సంఖ్యకు తేడాలు ఉండే అవకాశం కూడా ఉందని అధికారులు తెలిపారు. దీంతో గల్లంతైన వారి ఖచ్చిత సంఖ్యపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# కంబోడియా చేరుకున్న ఐఎన్ఎస్ కులిశ్

**రీమ్ బేస్, కంబోడియా, సెప్టెంబర్ 13,**



భారత నౌకాదళానికి చెందిన యుద్ధ నౌక ఐఎన్ఎస్ కులిశ్ తూర్పు నౌకాదళ ఆపరేషనల్ మోహరింపులో భాగంగా కంబోడియాలోని రీమ్ నావల్ బేస్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కంబోడియా నౌకాదళ అధికా రులు భారత నౌకాదళ సిబ్బందికి ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటన భారత్--కంబోడియా మధ్య సముద్ర భద్రతా సహకారాన్ని మరింత బలోపేతం చేయనుంది. పర్యటన సందర్భంగా రెండు దేశాల నౌకాదళాల మధ్య పలు వృత్తిపరమైన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సైనిక నైపుణ్యాల పెంపు, పరస్పర అవగాహన, సముద్ర భద్రత అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల నౌకాదళ సిబ్బంది అనుభవాలను పంచుకుంటూ కార్యాచరణలో సమన్వయాన్ని పెంపొందించుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఉమ్మడి శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిం చనున్నారు. సముద్ర భద్రత, శోధన--రక్షణ చర్యలు, కార్యాచరణ సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాలు ఇరు దేశాల నౌకాదళాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత విస్తరించనున్నాయి. అలాగే క్రీడా పోటీలు, క్రాస్-డెక్ సందర్శనలు నిర్వ హించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా నౌకాదళ సిబ్బంది మధ్య స్నేహపూర్వక సంబంధాలు పెంపొందడంతో పాటు వృత్తిపరమైన అనుబంధాలు మరింత బలపడ నున్నాయి. సైనిక స్థాయిలో పరస్పర అవగాహన పెంచేం దుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు భావిస్తు న్నారు. భారత్ అమలు చేస్తున్న "యాక్ట్ ఈస్ట్" విధానానికి అనుగుణంగా ఆగ్నేయాసియా దేశాలతో సంబం ధాలను బలోపేతం చేసే దిశగా ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడిం ది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, సహకారం, స్థిరత్వం కోసం భారత్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఇది ఒక కీలక భాగంగా నిలుస్తోంది. ఈ నౌకా పర్యటన భారత్--కంబోడియా మధ్య పెరుగుతున్న సముద్ర భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని భారత నౌకాదళం పేర్కొంది. పరస్పర విశ్వాసం, సహకారం, కార్యాచరణ సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ ఇరు దేశాల మధ్య రక్షణ సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ పర్యటన దోహదపడనుంది.

# గోవాలో సీఐఎస్ఎఫ్ డీజీ పర్యటన

**గోవా, సెప్టెంబర్ 13,**

కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్ సీనియర్ అధికారులతో కలిసి గోవాలోని సీఐఎస్ఎఫ్ యూనిట్ ఎంపీఏ గోవా మరియు ఉత్తర గోవాలోని పెర్నెం వద్ద ఉన్న 6వ రిజర్వ్ బెటాలియన్ (కోస్టల్ అండ్ పోర్ట్ సెక్యూరిటీను సందర్శించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, కార్యాచరణ సామర్థ్యం, యూనిట్‌ల పనితీరును సమీక్షించారు. ఎంపీఏ గోవా పర్యటనలో భాగంగా డీజీ ప్రవీర్ రంజన్ టగ్ బోట్‌లో ప్రయాణించి పోర్టు భద్రతా వ్యవస్థలను పరిశీలించారు. అనంతరం ఎంపీఏ గోవా చైర్‌పర్సన్, డిప్యూటీ చైర్‌పర్సన్‌లతో సమావేశమై పోర్టుకు సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిపారు. భద్రతా ప్రమాణాలు, సముద్ర తీర భద్రత, కార్యాచరణ సమన్వయంపై అభిప్రాయాలు పంచుకున్నారు. పెర్నెంలోని 6వ రిజర్వ్ బెటాలియన్‌లో డీజీ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనిట్ పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. త్వరలో ప్రారంభం కానున్న భవనాల కోసం అవసరమైన ఫర్నిచర్ అవసరాలను ముందుగానే ప్రణాళిక చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా బెటాలియన్ పరిధిలో కేంద్రీయ విద్యాల యం ఏర్పాటు ప్రతిపాదనను సిద్ధం చేయాలని సూ చించారు. మహిళా సిబ్బంది కోసం ప్రస్తుతం ఉన్న బ్యారక్‌లలో ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించే అంశా న్ని కూడా పరిశీలించాలని ఆదేశించారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్, సీపీడబ్ల్యూడీతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషిని డీజీ అభినందించారు. మౌలిక వసతుల అభివృద్ధి, భద్రతా ప్రమాణాల పెంపులో వారి పాత్రను కొనియా డారు. సమన్వయంతో పనిచేస్తూ సంస్థ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు. సీఐఎస్ ఎఫ్ సిబ్బంది వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ, విధి నిర్వహ ణలో అంకితభావం కొనసాగించాలని ప్రవీర్ రంజన్ పిలుపునిచ్చారు. కార్యాచ రణలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించడంతో పాటు సిబ్బం ది సంక్షేమాన్ని కూడా సమానంగా పరిగణించాలని పేర్కొ న్నారు. భద్రతా రంగంలో సీఐఎస్ఎఫ్ మరింత సమర్థ వంతం గా పనిచేసేలా చర్యలు కొనసాగించాలని సూచించారు.



# ఖమ్మంలో జనసేన శంఖారావం సభ

**ఖమ్మం, సెప్టెంబర్ 13,**

జనసేన పార్టీ నిర్వహించిన "జనసేన తెలంగాణ శంఖారావం" సభ ఖమ్మంలోని ఎంబీ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో అట్టహాసంగా ప్రారంభమైంది. "పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం" వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిమంది నాయకులు, జనసైనికులు, వీర మహిళలు హాజరయ్యారు. సభ ప్రాంగణం జనసేన జెండాలు, నినాదాలతో సందడిగా మారింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, జనసేన పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహించారు. కార్యక్రమానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, రాధారం రాజలింగం, తనీష్ అల్లాడి ముఖ్య అతిథులుగా హాజర య్యారు. సభకు ముందు ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఖమ్మం బైపాస్ రోడ్ మీదుగా ర్యాలీగా ఎంబీ ఫంక్షన్ హాల్ వరకు చేరుకున్నారు. ర్యాలీ సందర్భంగా జనసేన పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి శంఖారావం సభలు వేదికలుగా మారనున్నాయని నాయకులు వెల్లడించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటమే జనసేన లక్ష్యమని స్పష్టం చేశారు. ఖమ్మంలో నిర్వహించిన ఈ శంఖారావం సభ జనసేన శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు అభిప్రాయపడ్డారు.



# రోబోటిక్ సర్జరీ సేవల విస్తరణకు చర్యలు




హైదరాబాద్, సెప్టెంబర్ 13, ::

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సనత్‌నగర్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన స్టేట్ లెవల్ మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. సామాన్య ప్రజలకు అత్యున్నత వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వర్క్‌షాప్ సందర్భంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక మెడికల్ రోబోటిక్ పరికరాలు, మౌలిక వసతులను మంత్రి పరిశీలించారు. రోబోటిక్ సర్జరీ రంగంలో జరుగుతున్న సాంకేతిక అభివృద్ధి, వాటి వినియోగం, భవిష్యత్ అవకాశాలపై నిపుణులతో చర్చించారు. వైద్యరంగంలో ఆధునిక సాంకేతికతను మరింతగా వినియోగించి ప్రజలకు మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో వైద్య సేవల బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఫార్మా హబ్‌గా పేరుగాంచిన తెలంగాణను వైద్య సేవల రంగంలో కూడా అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కొత్త టిమ్స్ ఆసుపత్రులు, ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నాణ్యమైన వైద్య విద్య అందించేందుకు మెడికల్ కాలేజీలు, శిక్షణా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో వచ్చే ఆరు నెలల్లో రోబోటిక్ సర్జరీ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. దేశంలో రోబోటిక్ సర్జరీ రంగంలో ప్రముఖ నిపుణుడైన డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ సేవలను తెలంగాణలో వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నిమ్స్ ఆసుపత్రి వెయ్యికి పైగా రోబోటిక్ సర్జరీలు నిర్వహించి ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, టిమ్స్ ఆసుపత్రులు, నూతన ఉస్మానియా ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రి, నీలోఫర్ ఆసుపత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా రోబోటిక్ సర్జరీ సేవలను విస్తరించనున్నట్లు మంత్రి తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న టిమ్స్, ఉస్మానియా ఆసుపత్రులు పూర్తయితే రాష్ట్రంలో 40 వేలకుపైగా పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. మెడికల్ టూరిజం పాలసీలో భాగంగా టిమ్స్ ఆసుపత్రిలో 100 పడకలను అంతర్జాతీయ రోగుల కోసం కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేర్, ట్రామా కేర్ విధానాలను అమలు చేస్తున్నామని, ప్రస్తుతం 102 డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తుండగా మరో 79 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణను దేశంలోనే అడ్వాన్స్ రోబోటిక్ సర్జరీ సేవల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం: కొండా సురేఖ

, సెప్టెంబర్ 13, ::

తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ స్పష్టం చేశారు. వరంగల్‌లో తన భర్త కొండా మురళితో కలిసి పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచన లేదని తేల్చి చెప్పారు. తాము కాంగ్రెస్‌లోనే పుట్టి పెరిగామని, ఆ పార్టీతోనే తమ రాజకీయ ప్రయాణం కొనసాగుతుందని కొండా సురేఖ పేర్కొన్నారు. గతంలో కొన్ని రాజకీయ పరిస్థితుల కారణంగా బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని, కానీ కాంగ్రెస్‌తో తమ అనుబంధం ఎప్పటికీ కొనసాగు తుందని అన్నారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లో నూ కాంగ్రెస్ పార్టీ టికెట్‌పైనే పోటీ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పదవి నుంచి తొలగించిన విషయంపై స్పందిస్తూ, పదవి కోల్పోయినందుకు తనకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదన్నారు. అయితే తనను ఎందుకు తప్పించారో కారణం చెప్పకపోవడం మాత్రమే బాధ కలిగిం చిందని పేర్కొన్నారు. మంత్రి పదవి ఒక



అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన శాఖలను పారదర్శకంగా నిర్వహించానని తెలిపారు. పార్టీ మార్పు ప్రచారం నేప థ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడబోనని వారికి స్పష్టం చేసినట్లు సురేఖ వెల్లడించారు. ఈ సందర్భంగా తన భర్త కొండా మురళికి త్వరలోనే కీలక బాధ్యత లేదా పదవి దక్కే అవకాశాలపై కూడా అధిష్ఠానం నుంచి సంకేతాలు వచ్చాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రె స్ అభ్యర్థిగా మళ్లీ పోటీ చేసి విజయం సాధిస్తానని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే త్వరలో జరగనున్న వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివి జన్లలో కాంగ్రెస్ పార్టీని గెలి పించడమే తమ లక్ష్యమని ప్రక టించారు. ఈ సంద ర్భంగా స్థానిక రాజకీయ నా య కులపై కూడా కొండా సురేఖ విమర్శలు చేశారు. కొందరు నేతలు తమపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్నా రని మండి పడ్డారు. గత రాజకీ య పరిణామాలను ప్రస్తావిస్తూ కొందరు స్థానిక నాయకులు తమను మోసం చేశారని ఆరోపించారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని, భవిష్య త్తులోనూ పార్టీ కోసం కృషి కొనసాగిస్తామని సురేఖ స్పష్టం చేశారు.

# గణేష్ దర్శనాలకు ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, సెప్టెంబర్ 13, ::

వినాయక నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రముఖ గణపతి మండపాల దర్శనానికి వెళ్లే భక్తుల కోసం టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి తెలిపారు. ఖైరతాబాద్, బాలాపూర్ గణపతి మండపాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 14 నుంచి 24వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సులభంగా గణపతి మండపాలకు చేరుకునేలా ప్రత్యేక రూట్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఖైరతాబాద్ మహా గణపతి, బాలాపూర్ గణపతి దర్శనాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సమస్యలను తగ్గించడంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రద్దీ సమయాల్లో అదనపు సర్వీసులను కూడా నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట అదనపు బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రత్యేక బస్సుల నిర్వహణతో భక్తులు సొంత వాహనాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు వీలైనంత వరకు




ఆర్టీసీ సేవలను వినియోగిం చుకోవాలని సూచించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తులకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా దర్శనాలు చేసుకునేలా సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు.

# ప్రపంచ వ్యాక్సిన్ కేంద్రంగా భారత్: జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, ::

ప్రపంచంలో అత్యధిక పరిమాణంలో వ్యాక్సిన్లను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తున్న దేశంగా భారత్ నిలిచిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన "కోలిషన్ ఫర్ ఎపిడెమిక్ ప్రిపేర్డ్‌నెస్ ఇన్నోవేషన్స్" (సీఈపీఐ) బోర్డు, ఇన్వెస్టర్స్ కౌన్సిల్ సభ్యుల సత్కార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రపంచ ఆరోగ్య భద్రతలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. భారత్ ఇప్పటికే ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తి రంగంలో అగ్రస్థానంలో ఉందని వివరించారు. భారత్‌లో కనిపించే విభిన్న రకాల వ్యాధుల పరిస్థితులు వ్యాక్సిన్ పరిశోధనకు ప్రత్యేక అవకాశాలను కల్పిస్తున్నాయని జితేంద్ర సింగ్ అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలతో పోలిస్తే ఇక్కడి వైవిధ్యమైన ఆరోగ్య పరిస్థితులు శాస్త్రవేత్తలకు విస్తృత పరిశోధన అవకాశాలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేకత భవిష్యత్ అంటువ్యాధులను ముందుగానే అంచనా వేసి నివారించడంలో దేశానికి బలంగా మారుతుందని చెప్పారు. కొవిడ్ మహమ్మారి అనంతరం భారత్ ఆరోగ్య రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. ఒక దశాబ్దం క్రితం ఉన్న పరిమితులను అధిగమించి, ఇప్పుడు ప్రపంచ స్థాయి మహ మ్మారి సన్నద్ధతలో భాగస్వా మిగా నిలిచే స్థాయికి చేరుకుందని పేర్కొ న్నారు. వ్యాక్సిన్ అభి వృద్ధి, బయోటెక్నాలజీ పరిశోధనలు, బయో మాన్యుఫాక్చరింగ్ రంగా ల్లో దేశం వేగంగా ముందుకు సాగుతోందన్నారు. భారత్‌ను ప్రపంచ బయోమాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని జితేంద్ర సింగ్ వివరించారు. బయోఫార్మా, వ్యాక్సిన్ తయారీ, నూతన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. పరిశోధన, పెట్టుబడులు, ఆవిష్కరణల సమన్వయంతో భారత బయోటెక్ రంగం కొత్త శిఖరాలను అధిరోహిస్తోందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంక్షోభాల సమయంలో భారత్ అందించిన సేవలను అంతర్జాతీయ సమాజం గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో



నాణ్యమైన వ్యాక్సిన్లను తయారు చేసి అనేక దేశాలకు సరఫరా చేయడం ద్వారా భారత్ విశ్వసనీయ భాగస్వామిగా నిలిచిందన్నారు. వ్యాక్సిన్ ఉత్పత్తి, పంపిణీ సామర్థ్యాలు దేశానికి అంతర్జాతీయ గుర్తిం పును తెచ్చిపెట్టాయని చెప్పారు. భవిష్యత్ మహమ్మారులను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. పరిశోధన, సాంకేతికత, పెట్టుబడుల సమన్వయంతోనే ప్రపంచ ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయవచ్చన్నారు. ఈ దిశగా భారత్ తన అను భవం, సామర్థ్యాన్ని ప్రపంచంతో పంచుకునేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.




# కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13, ::

శాసన మండలి సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, పాలనా డొల్లతనం బట్టబయలయ్యాయని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపలేదని ఆరోపించారు. సభ నిర్వహణలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించలేదని వ్యాఖ్యానించారు. మండలి సమావేశాల సందర్భంగా పోలీసుల భారీ మోహరింపు, ప్రత్యక్ష ప్రసారాల్లో వివక్షత చోటుచేసుకుందని మధుసూదనాచారి ఆరోపించారు. ఇలాంటి పరిస్థితులు ఉమ్మడి రాష్ట్రంలో కూడా చూడలేదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష స్వరాన్ని అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలకు సంబంధించిన 20 అంశాలను ప్రతిపక్షం తరఫున సభలో ప్రస్తావించినప్పటికీ వాటిని చర్చకు అనుమతించలేదని తెలిపారు. తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా పక్కనపెట్టారని ఆరోపించారు. ప్రజలకు సంబంధించిన అత్యవసర అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం బిల్లుల ఆమోదానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని మధుసూదనాచారి విమర్శించారు. ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం చర్చకు దూరంగా ఉందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభలు, శాసన మండళ్లు ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉండాలని ఆయన అన్నారు. అలాంటి వేదికలను కేవలం చట్టాల ఆమోదానికి మాత్రమే పరిమితం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష అభిప్రాయాలను కూడా ప్రభుత్వం గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను భవిష్యత్తులో కూడా సభలో బలంగా ప్రస్తావిస్తామని మధుసూదనాచారి స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలపై స్పందించి చర్చలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేలా సభా నిర్వహణ జరగాలని కోరారు.

# బ్రిక్స్ విందుపై రాహుల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, ::

బ్రిక్స్ 18వ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన గాలా డిన్నర్‌లో పూర్తిగా శాకాహార వంటకాలు వడ్డించడంపై కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. భారతదేశంలో అధిక శాతం ప్రజలు మాంసాహారులేనని, భారతీయ నాన్‌వెజ్ వంటకాలు కూడా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు హాజరైన వివిధ దేశాల అధినేతలు, ప్రతినిధుల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. భారత్ మండపంలో నిర్వహించిన ఈ గాలా డిన్నర్‌లో భారతీయ సంప్రదాయ శాకాహార వంటకాలను అతిథులకు అందించారు. ఈ మెనూ ఎంపికపై రాహుల్ గాంధీ తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా వ్యక్తం చేశారు. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో చేసిన పోస్టులో "భారతీయుల్లో 80 శాతం మంది నాన్‌వెజిటేరియన్లు. భారతీయ నాన్‌వెజ్ ఆహారం ఎంతో రుచికరంగా ఉంటుంది" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తన సోదరి తయారు చేసే ఛోలే భటూరే ఎంతో ఇష్టమని కూడా వ్యాఖ్యానించారు. ఈ పోస్టుతో పాటు ఛోలే భటూరే ఫొటోను పంచుకున్నారు. భారతీయ ఆహార సంస్కృతి వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తుందని రాహుల్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ దేశాల ప్రతినిధులు భారత్‌కు వచ్చిన సందర్భంలో దేశంలోని వివిధ ప్రాంతాల ఆహార సంప్రదాయాలను పరిచయం చేసే అవకాశం ఉంటుందని సూచించి నట్లుగా రాజకీయ వర్గాలు విశ్లేషి స్తున్నాయి. ఇదిలా ఉండగా, బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో భారతీయ సంప్రదాయ శాకాహార వంటకాలకు ప్రాధాన్యం ఇచ్చారు. దేశీయ ఆహార వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా మెనూను రూపొందించినట్లు నిర్వాహక వర్గాలు తెలిపాయి. విదేశీ అతిథులకు భారతీయ రుచులను పరిచయం చేయడమే ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నాయి. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ప్రపంచంలోని పలు దేశాల నాయకులు, ప్రతినిధులు భారతదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన గాలా డిన్నర్, సాంస్కృతిక కార్యక్రమాలు, ద్వైపాక్షిక సమావేశాలు అంతర్జాతీయ వేదికపై భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.






# వైభవ్ కోసం అఫ్గాన్ ప్రత్యేక వ్యూహం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 ::**

అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు సిద్ధమవుతోంది. ఈ సిరీస్‌లో అందరి దృష్టి 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే ఉంది. ఐపీఎల్‌తో పాటు పలు టోర్నీల్లో అంచనాలకు మించి రాణించిన వైభవ్‌ను ఎదుర్కొనేందుకు అఫ్గానిస్థాన్ ఇప్పటికే ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేసుకుంది.



# షమీ ఎంపికకు వయసు అడ్డంకి కాదు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 ::**

భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీని వయసు కారణంగానే జాతీయ జట్టుకు ఎంపిక చేయడం లేదన్న ప్రచారాన్ని మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా ఖండించాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సీనియర్ ఆటగాళ్లు జట్టులో కొనసాగుతున్న సమయంలో షమీ విషయంలో మాత్రమే వయసును కారణంగా చూపడం సరికాదని పేర్కొన్నాడు.

## గాయాలే ప్రధాన సమస్య

36 ఏళ్ల షమీ గత కొంతకాలంగా గాయాలతో ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో జాతీయ జట్టుకు దూరంగా ఉంటున్నాడు. సెలక్షన్ కమిటీ యువ బౌలర్లకు ప్రాధాన్యం ఇస్తుండటంతో షమీ కెరీర్ ముగింపు దశకు చేరుకుందనే చర్చ మొదలైంది. అయితే షమీ ఎంపికకు వయసు అడ్డంకి కాదని చోప్రా స్పష్టం చేశాడు.షమీ విషయంలో సెలక్టర్లు ఏదో ఒక సమయంలో స్పష్టత ఇస్తారని, అయితే ఎంపికకు వయసు కారణం కాదని చోప్రా అభిప్రాయపడ్డాడు. గాయాలు, ఫిట్‌నెస్ అంశాలే ప్రస్తుతం కీలకంగా ఉన్నట్లు పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌ను ఉదాహరణగా ప్రస్తావిస్తూ.. పూర్తి ఫిట్‌నెస్‌తో నిరంతరం ఆడుతున్న ఆటగాళ్లకు వయసు పెద్ద అడ్డంకి కాదని సూచించాడు.



# సబలెంకాకు షాక్.. రిబకినా ఛాంపియన్

**న్యూయార్క్, సెప్టెంబరు 13 ::**

యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను వరుసగా మూడోసారి గెలుచుకుని హ్యాట్రిక్ సాధించాలనుకున్న టెన్నిస్ స్టార్ అరీనా సబలెంకా ఆశలకు ప్రపంచ నంబర్‌వన్ ఎలీనా రిబకినా చెక్ పెట్టింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో రిబకినా: 6-4, 5-7, 6-2 తేడాతో సబలెంకాపై విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది.

## రాకెట్ బద్దలు కొట్టిన సబలెంకా

ఫైనల్ ఓటమిని సబలెంకా తీవ్రంగా తీసుకుంది. మ్యాచ్ పాయింట్ కోల్పోయిన వెంటనే అసహనానికి గురైన ఆమె తన రాకెట్‌ను నేలకేసి కొట్టి బద్దలు కొట్టింది. అనంతరం తన భావోద్వేగాలను చిత్రీకరించేందుకు ప్రయత్నించిన కెమెరా సిబ్బందిపైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## నంబర్‌వన్ ర్యాంక్ కోల్పోయిన సబలెంకా

ఈ ఓటమితో 99 వారాలుగా కొనసాగుతున్న సబలెంకా ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌కు తెరపడింది. ఆమెను వెనక్కి నెట్టి రిబకినా అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అయితే ఓటమి అనంతరం సబలెంకా నిరాశలో కూరుకుపోకుండా వచ్చే సీజన్‌లో మరింత బలంగా తిరిగి వస్తానని తెలిపింది. ఈ టోర్నీలో తాను ఆడిన స్థాయిపై సంతృప్తిగా ఉన్నానని, ఈ అనుభవాల నుంచి ఎంతో నేర్చుకున్నానని పేర్కొంది.

## 31 ఏళ్ల తర్వాత అరుదైన ఘనత

కజకిస్థాన్‌కు చెందిన రిబకినాకు ఇది కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఒకే ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్‌ను ఓడించిన రెండో క్రీడాకారిణిగా ఆమె రికార్డు సృష్టించింది. ఇంతకుముందు 1995లో టెన్నిస్ దిగ్గజం స్టెఫీ గ్రాఫ్ ఈ ఘనత సాధించింది. దాదాపు 31 ఏళ్ల తర్వాత రిబకినా ఈ అరుదైన రికార్డును సమం చేసింది.

# వింటేజ్ లుక్‌లో టీమిండియా క్రికెటర్లు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 ::**

సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం వైరల్‌గా మారిన 1980ల నాటి ఫొటోల ట్రెండ్ టీమిండియా క్రికెటర్లను కూడా ఆకట్టుకుంది. అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు భారత ఆటగాళ్లు తమ ఫొటోలకు పాతకాలపు రూపాన్ని ఇచ్చి సందడి చేశారు. పాతకాలపు రూపంలో ఆటగాళ్లు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, నితీశ్ రెడ్డి తదితరులు ఈ ట్రెండ్‌లో భాగమయ్యారు. తమ ఫొటోలను 1980ల నాటి శైలిలో చూసుకుని ఆటగాళ్లు సరదాగా స్పందించారు. బీసీసీఐ వీడియోతో వైరల్ టీమిండియా ఆటగాళ్ల వింటేజ్ ఫొటోల సందడిని బీసీసీఐ వీడియోగా రూపొందించి ఎక్స్‌లో పంచుకుంది. దీంతో ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అఫ్గానిస్థాన్‌తో సిరీస్‌కు ముందు ఆటగాళ్ల సరదా క్షణాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం తొలి టీ20

భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. ఆదివారం తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. భారత జట్టు: శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీశ్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, యశ్ ఠాకూర్.




# భారత్-ఆఫ్ఘన్ మ్యాచ్‌కు వర్షం ముప్పు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 ::**

భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఆదివారం జరగనున్న తొలి టీ20 మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా మ్యాచ్ జరగనుండగా.. వాతావరణ పరిస్థితులు అభిమానుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. మ్యాచ్ సమయంలో వర్షం కురిసే అవకాశం ఉండటంతో ఆట సజావుగా సాగుతుందా? లేదా? అన్న ఉత్కంఠ నెలకొంది.

## 64 శాతం వర్షం అవకాశం

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఆదివారం ఢిల్లీలో వర్షం కురిసే అవకాశం 64 శాతంగా ఉంది. ముఖ్యంగా మ్యాచ్ జరిగే సాయంత్రం వేళ వర్షం అంత రాయం కలిగించే అవకాశాలు కనిపిస్తు న్నాయి. సాయంత్రం 7 గంటల సమయం లో వర్షం పడే అవకాశం 37 నుంచి 40 శాతం వరకు ఉన్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. దీంతో మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభం కావడం లేదా




మధ్యలో వర్షం కారణంగా ఆటకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. మ్యాచ్ పూర్తిగా రద్దయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నప్పటికీ.. పరిస్థితులను బట్టి ఓవర్లను కుదించే అవకాశం ఉంది. స్పిన్‌తో ఆఫ్ఘన్ సవాల్ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆఫ్ఘనిస్థాన్ ఆతిథ్య జట్టుగా వ్యవహ రిస్తోంది. రషీద్ ఖాన్, ముజీబ్ ఉర్ రెహ మాన్ వంటి నాణ్యమైన స్పిన్నర్లు ఆ జట్టులో ఉండటంతో భారత బ్యాటర్లకు సవా ల్ ఎదురుకానుంది. ఆఫ్ఘన్ స్పిన్ దాడిని టీమిం డియా బ్యాటర్లు ఎలా ఎదుర్కొం టార నేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు గాయం నుంచి కోలుకుని జట్టులోకి తిరిగి వచ్చిన భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ప్రదర్శనపైనా అభిమానుల దృష్టి ఉంది.

# మెస్సీ మ్యాజిక్.. మయామికి డ్రా

**న్యూయార్క్, సెప్టెంబరు 13 ::**

**మేజర్ లీగ్ సాకర్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ మరోసారి తన ప్రతిభను చాటాడు. నాష్‌విల్లే ఎస్సీతో జరిగిన మ్యాచ్‌లో పెనాల్టీ ప్రాంతం వెలుపలి నుంచి అద్భుతమైన గోల్ చేసి ఇంటర్ మయామిని ఆధిక్యంలో నిలిపాడు.**

అయితే చివరి నిమిషాల్లో నాష్‌విల్లే గోల్ చేయడంతో మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది.

## మెస్సీ అద్భుత గోల్

మ్యాచ్ ఆరంభంలోనే నాష్‌విల్లే దూకుడుగా ఆడింది. నాలుగో నిమిషంలో సామ్ సరిడ్జ్ గోల్ చేసి తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. 19వ నిమిషంలో మెస్సీ కొట్టిన కార్నర్ కిక్‌ను అడ్డుకునే క్రమంలో నాష్‌విల్లే డిఫెండర్ రీడ్ బేకర్-వైటింగ్ పొరపాటున బంతిని సొంత గోల్ పోస్టులోకి పంపడంతో స్కోరు 1-1తో సమమైంది.

## ఈ సీజన్‌లో 19వ గోల్

రెండో అర్ధభాగంలో మెస్సీ తనదైన శైలిలో మెరిశాడు. 62వ నిమిషంలో రోడ్రిగో డి పాల్ నుంచి పాస్ అందుకున్న అతడు.. పెనాల్టీ ప్రాంతం వెలుపలి నుంచి ఎడమ కాలితో అద్భుతమైన షాట్ కొట్టి బంతిని నేరుగా గోల్ నెట్‌లోకి పంపాడు. దీంతో ఇంటర్ మయామి 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ సీజన్‌లో మెస్సీకి ఇది 19వ గోల్. దీంతో టాప్ స్కోరర్‌గా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు.

## చివర్లో నాష్‌విల్లే షాక్

మయామి విజయం ఖాయమని భావించిన సమయంలో నాష్‌విల్లే అనూహ్యంగా పుంజుకుంది. అదనపు సమయంలో సామ్ సరిడ్జ్ మరో గోల్ చేసి స్కోరును 2-2తో సమం చేశాడు.



## ‘డ్రాగన్’లో భారీ ఇంటర్వెల్ యాక్షన్!

**హైదరాబాద్, సెప్టెంబరు 13 ::**

యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాస్ యాక్షన్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న ‘డ్రాగన్’పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం కావడంతో మొదటి నుంచే ఈ సినిమాపై ఆసక్తి పెరిగింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

‘డ్రాగన్’లో ఇంటర్వెల్ సీక్వెన్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సాధారణ లొకేషన్‌లో కాకుండా ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించి కీలక యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సెట్‌లో సుమారు రెండు వారాల పాటు వరుసగా చిత్రీకరణ జరపనున్నట్లు తెలుస్తోంది.

పీటర్ హెయిన్ పర్యవేక్షణలో..

ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌లో ఎన్టీఆర్‌ను మాస్ యాక్షన్ అవతార్‌లో చూపించనున్నట్లు సమాచారం. ప్రముఖ స్టంట్ దర్శకుడు పీటర్ హెయిన్ పర్యవేక్షణలో ఎన్టీఆర్‌పై కీలక పోరాట సన్నివేశాలను రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ చిత్రాల్లో యాక్షన్ సన్నివేశాలకు ప్రత్యేకమైన శైలి ఉండటంతో ఈ ఎపిసోడ్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది.

ఎన్టీఆర్ కోలుకున్న తర్వాతే..

ఎన్టీఆర్ ఇటీవల గాయపడటంతో ఆయనకు శస్త్రచికిత్స జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని తెలుస్తోంది. పూర్తిగా కోలుకున్న తర్వాతే చిత్రీకరణలో పాల్గొనే అవకాశం ఉంది. దీంతో ఎన్టీఆర్ ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా రాబోయే షెడ్యూల్స్‌ను చిత్రబృందం రూపొందిస్తున్నట్లు సమాచారం.

## గురువుల బాటలో.. స్టార్ దర్శకులుగా!

**హైదరాబాద్, సెప్టెంబరు 13 ::**

ఒక విజయవంతమైన సినిమా వెనుక దర్శకుడితో పాటు ఎంతోమంది సహాయ దర్శకుల కృషి ఉంటుంది. తెరవెనుక ఎన్నో మెలకువలు నేర్చుకున్న వారిలో కొందరు ఆ తర్వాత స్వతంత్ర దర్శకులుగా మారి చిత్ర పరిశ్రమలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. టాలీవుడ్‌తో పాటు భారతీయ చలనచిత్ర పరిశ్రమలో పలువురు అగ్ర దర్శకులు తమ వద్ద పనిచేసిన ప్రతిభా వంతులను ప్రోత్సహించి దర్శకులుగా తీర్చిదిద్దారు. రామ్‌గోపాల్ వర్మ నుంచి సుకుమార్ వరకు భారతీయ సినిమా రూపురేఖలను ప్రభావితం చేసిన దర్శకుల్లో రామ్‌గోపాల్ వర్మ ఒకరు. ఆయన వద్ద పనిచేసిన వారిలో కృష్ణవంశీ, పూరి జగన్నాథ్, గుణశేఖర్, తేజ, హరీశ్ శంకర్, శివ నాగేశ్వరరావు, అనురాగ్ కశ్యప్, మధుర్ భండార్కర్ వంటి పలువురు దర్శకులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే దర్శకుడు సుకుమార్ కూడా తన బృందం లోని ప్రతిభావంతులకు అవకాశాలు కల్పించారు. ఆయనతో కలిసి పనిచేసిన బొమ్మరిల్లు భాస్కర్, శ్రీకాంత్ అడ్డాల, వేణు శ్రీరామ్, పాలనాటి సూర్యప్రతాప్, బుచ్చిబాబు సానా, శ్రీకాంత్ ఓదెల తదిత రులు దర్శకులుగా తమ సత్తా చాటారు. రాజమౌళి, పూరి శిష్యులు ప్రపంచవ్యాప్తంగా భారతీయ సినిమాకు గుర్తింపు తీసుకొ చ్చిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వ విభాగంలో పనిచేసిన పలువురు ప్రతిభావంతులు కూడా తర్వాత స్వతంత్రంగా సినిమాలు తెరకెక్కించారు.





## ప్రీతి జింటా రీఎంట్రీ.. ఆసక్తికర వ్యాఖ్యలు

కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న బాలీవుడ్ నటి ప్రీతి జింటా ఇప్పుడు వరుస చిత్రాలతో రీఎంట్రీకి సిద్ధమవుతున్నారు. ‘వైబ్’ అనే యాక్షన్ కామెడీ చిత్రంతో పాటు ‘బట్వారా 1947’లోనూ ఆమె నటిస్తున్నారు. ‘వైబ్’లో ‘మేడమ్ హెచ్’ అనే శక్తిమంతమైన గూఢచారి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబరు 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతి పాత్రలోనూ సందేహమే.. తాజాగా జరిగిన సినిమా ప్రచార కార్యక్రమాల్లో నటి వంశిక ధీర్ తనను తాను పెద్ద తెరపై చూసుకున్నప్పుడు ‘ఇంపాస్టర్ సిండ్రోమ్’ అనిపించిందని చెప్పింది. దీనిపై ప్రీతి జింటా స్పందిస్తూ.. ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్నప్పటికీ ప్రతి కొత్త పాత్రను స్వీకరించినప్పుడు ‘నేను ఈ పాత్రను సరిగ్గా చేయగలనా?’ అనే సందేహం తనకూ వస్తుందని వెల్లడించారు. సొంత సినిమాలు చూడటం ఇబ్బందిగా.. తన తెరపై చూడటం తనకు చాలా ఇబ్బందిగా ఉంటుందని ప్రీతి జింటా తెలిపారు. థియేటర్‌లో కూర్చుని సినిమా చూస్తున్నం తసేపూ.. తాను చేసిన సన్నివేశాల గురించి ఆలోచిస్తూనే ఉంటానని చెప్పారు.

## ఏడుగురు మహిళల ప్రయాణమే ‘హ్యాపీ జర్నీ’

భిన్నమైన మనస్తత్వాలు కలిగిన ఏడుగురు మహిళలు ఒకే ప్రయాణానికి వెళ్తే ఎలాంటి సరదా సంఘటనలు, ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటాయనే విభిన్న కథాంశంతో తెరకెక్కిన చిత్రం ‘హ్యాపీ జర్నీ’. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలై ఆకట్టుకుంటోంది.

యూరప్ పర్యటన నేపథ్యంలో సినిమా కథ సాగుతుంది. వివిధ తరాలకు చెందిన ఏడుగురు మహిళలు ఈ ప్రయాణంలో కలుసుకుంటారు. భిన్నమైన అభిప్రాయాలు, మనస్తత్వాల కారణంగా తొలుత వారి మధ్య చిన్నచిన్న గొడవలు, సరదా సంభాషణలు చోటుచేసుకుంటాయి. ఆ తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ప్రయాణాన్ని కొనసాగించే క్రమంలో భావోద్వేగభరితమైన సంఘటనలు చోటుచేసుకుంటాయని ట్రైలర్ ద్వారా తెలుస్తోంది.

టాలీవుడ్ సీనియర్ నటి అన్నపూర్ణ, ఆమని, ప్రముఖ యాంకర్ ఝాన్సీతో పాటు వంశీ, పాయల్ రాధాకృష్ణ, సునయన, రవి శివతేజ, జినీష్ అలిశెట్టి, రూప శ్రీనివాస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. వినోదంతో పాటు కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యమిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది.

అభీరామ్ నాయుడు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గుట్ట ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిలిం కార్పొరేషన్ పతాకాలపై గుట్ట బాలాజీ, గుండాల కౌశిక్ రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించగా, మణికంఠ సుబ్రమణియన్ ఛాయాగ్రహణం నిర్వహించారు. వినోదం, సెంటిమెంట్, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ‘హ్యాపీ జర్నీ’ సెప్టెంబరు 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.






## కామాక్షి భాస్కర్ల డాక్టర్ నుంచి నటిగా..

సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ప్రతి కథానాయికకు స్టార్‌డమ్ రావడం అంత సులభం కాదు. కొందరు వరుస చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంటే.. మరికొందరు చిన్న పాత్రలతోనే ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటారు. అలాంటి నటీమణుల్లో కామాక్షి భాస్కర్ల ఒకరు. వైద్య విద్యను అభ్యసించి వైద్యురాలిగా పనిచేసిన ఆమె.. నటనపై ఆసక్తితో సినీ రంగంలోకి అడుగుపెట్టి ప్రస్తుతం విభిన్న పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

మోడల్‌గా మొదలై.. నటిగా

కామాక్షి భాస్కర్ల చైనాలో ఎంబీబీఎస్ చదివినట్లు పలు కథనాలు పేర్కొంటున్నాయి. అనంతరం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో కొంతకాలం వైద్యురాలిగా పనిచేసినట్లు సమాచారం. సినిమాలపై ఆసక్తితో వైద్య వృత్తిని పక్కనపెట్టి నటన వైపు అడుగులు వేశారు. మోడల్‌గా కూడా పనిచేసిన ఆమె.. 2018లో ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ కిరీటాన్ని దక్కించుకున్నారు. అదే ఏడాది మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని ఫైనల్స్ వరకు వెళ్లారు.

సినీ ప్రయాణం తొలినాళ్లలో చిన్న పాత్రలు పోషించిన కామాక్షికి ‘మా ఊరి పొలిమేర’ కీలక మలుపుగా నిలిచింది. 2021లో విడుదలైన ఈ చిత్రంలో లక్ష్మి పాత్రలో మెప్పించారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ మంచి ఆదరణ పొందడంతో ఆమెకు గుర్తింపు పెరిగింది. అనంతరం ‘మా ఊరి పొలిమేర 2’లోనూ అదే పాత్రలో నటించి ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత ‘విరూపాక్ష’, ‘ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం’, ‘ఓం భీమ్ బుష్’ వంటి చిత్రాల్లో నటించారు. ‘ఝాన్సీ’, ‘సైతాన్’, ‘దూత’ వంటి వెబ్ సిరీస్‌లలోనూ కీలక పాత్రలు పోషించారు.

హారర్, థ్రిల్లర్ కథలకే పరిమితం కాకుండా కామెడీ, కుటుంబ కథలు, భావోద్వేగభరిత పాత్రల్లోనూ తన నటనా ప్రతిభను చూపిస్తున్నారు. ‘షో టైమ్’, ‘12ఏ రైల్వే కాలనీ’, ‘లైలా’ వంటి చిత్రాల్లో నటించిన ఆమె.. 2026లో ‘మెన్షన్ హౌస్ మల్లేశ్’, ‘డాకోయిట్: ఎ లవ్ స్టోరీ’ వంటి చిత్రాల్లోనూ భాగమయ్యారు. ప్రస్తుతం ‘పొలిమేర 3’పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. డాక్టర్‌గా స్థిరపడే అవకాశం ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన నటనా రంగాన్ని ఎంచుకున్న కామాక్షి.. కథ, పాత్రకు ప్రాధాన్యమున్న సినిమాలతో ముందుకు సాగుతున్నారు.

“This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467